సాక్షి
విశాఖపట్నం

మంగళవారం । 25 । జూలై । 2023



అర్జీల పరిష్కారం


'జగనన్నకు చెబుదాం' ద్వారా స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. 8లో



ఆర్ఆర్ఆర్ సెంటర్లతో.. 8లో

పర్యావరణ పరిరక్షణకు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉపయుక్తంగా నిలుస్తాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు.

అందంగా..



ఇందిరాగాంధీ జూ పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు ఆకర్షణీయంగా ఉన్నాయి. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద వాటి జీవిత విశేషాలు, చిత్రాలతో బోర్డులు ఉండేవి. ఇప్పుడు వాటి పక్కనే రాతి బోర్డులు ఏర్పాటు చేశారు. 10లో

న్యూస్‌రీల్

1న ఇనార్బిట్‌మాల్‌కు సీఎం శంకుస్థాపన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహానగరంలో నగర ప్రజల జీవన విధానానికి తగినట్టు ఇనార్బిట్‌మాల్‌ను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 1వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఆయన సోమవారం జోన్5 పరిధి 45వ వార్డు కైలాసపురం రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్‌మాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. శంకుస్థాపనకు అవసరమైన ఏర్పాట్లు, కార్యక్రమంలో పాల్గొనున్న అతిథులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌లో సబ్జెక్టు టీచర్ల భర్తీ

విశాఖ విద్య: జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని మల్కాపురంలో గణితం, ఫిజిక్స్, జువాలజీ అదేవిధంగా జెడ్పీ మేనేజ్‌మెంట్ పరిధిలోని కూండ్రంలో కెమిస్ట్రీ, గోపాలపట్నంలో గణితం, కెమిస్ట్రీ, పాయకరావుపేటలో కెమిస్ట్రీ, సివిక్స్, రాంపురంలో గణితం సబ్జెక్టుల బోధనకు టీచర్లు అవసరం ఉందన్నారు. ఆయా మేనేజ్‌మెంట్ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ (సంబంధిత సబ్జెక్టు)లు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 26న విద్యార్హత, సర్వీసు పరమైన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా విశాఖలోని డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత గల వారికి వెంటనే నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యోగా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం



సీతమ్మధార : విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో యోగా పోటీలు ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ యు. రామారావు, డాక్టర్. ఎం.రవి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 30న జరిగే జిల్లా స్థాయి యోగా పోటీలు సీతమ్మధార, నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 30తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 99088 38387, 94403 01277లలో సంప్రదించాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : వాల్తేర్ రైల్వే స్టేడియంలో అంతర హోటల్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ వంశీకృష్ణ సోమవారం ప్రారంభించారు. స్థానిక హోటల్స్ ఈ టోర్నీలో పాల్గొంటుండగా పది ఓవర్లు ఇన్నింగ్స్‌గా పోటీలు టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు శ్రీనివాస్, కార్తీక్, సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు. ప్రారంభ పోటీలో పామ్‌బీచ్‌తో పార్క్ హోటల్ జట్టు తలపడింది.

నేడూ అందుబాటులో రైతు బజార్లు

సీతమ్మధార: జిల్లాలోని 13 రైతుబజార్లు మంగళవారం తెరిచే ఉంటాయని జాయింట్ కలెక్టర్, రైతు బజార్ల చైర్మన్ కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సీతమ్మధార, పెదవాల్తేరు, కంచరపాలెం, గోపాలపట్నం, ములగాడ, పెదగంట్యాడ రైతు బజార్లకు సెలవైనప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం తెరిచి ఉంటాయన్నారు. సబ్సిడీపై టమాటాలు 13 రైతు బజార్లలో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సీతమ్మధార రైతుబజారులో 109 కేట్లు, ఎంవీపీలో 140, పెద వాల్తేరు 50, కంచరపాలెంలో 80, గోపాలపట్నం 80, పెద గంట్యాడ 20, ములగాడ 20, మధురవాడ 90, మద్రిపాలెం 67, స్టీల్‌ప్లాంట్ 30, పెందుర్తిలో 100, నర్సింహనగర్ 80, గాజువాక 40 కేట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

వదలని వాన!

- పెందుర్తిలో 8.2 సెం.మీల వర్షపాతం
- నేడు, రేపూ కొనసాగనున్న వర్షం

ఆశీలుమెట్ట సిగ్నల్ పాయింట్ వద్ద నిలిచిన వర్షపు నీరు



సోమవారం నాటి వర్షపాతం వివరాలు (సెం.మీ.లలో)

ప్రాంతం	వర్షపాతం						
గోస్తని	9.06	నల్లక్వారీ	8.2	అడవివరం	5.5	సాగర్‌నగర్	4.3
		నరవ	8.1	సింహాచలం	5.1	మధురవాడ	4.3
		పద్మనాభం	5.9	ఎండాడ	4.4	మంగళపాలెం	4.0

సాక్షి, విశాఖపట్నం: వాన వదలడం లేదు. మూడు రోజులుగా కురుస్తూనే ఉంది. సోమవారం నగరంకంటే శివారు ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులకే పరిమితమైంది. ఆ తర్వాత జోరు వాన మొదలై గాలులు, ఉరుములు, మెరుపుల హడావుడి లేకుండా చాలాసేపు వర్షించింది. దీంతో నగరంలోని పలు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. రాత్రికి వాన తెరపిచ్చింది. గోస్తని వద్ద అత్యధికంగా 9.06 సెం.మీల భారీ వర్షపాతం నమోదైంది. మంగళవారం బంగాళాఖాతంలో ఏర్పడనుంది. అది వాయుగుండంగానూ బలపడనుంది. దీంతో రానున్న రెండు రోజులు వర్షాలు కొనసాగనున్నాయి.



వర్షంలో తడుచుకుంటూ ఇంటికి వెళుతున్న పాఠశాలల విద్యార్థినులు



పెందుర్తి రహదారిపై చేరిన వర్షపు నీరు

చకచకా హార్బర్ పనులు

- తొలిదశలో ప్యాకేజింగ్, కోల్ చాంబర్, పార్కింగ్, రోడ్ల పనులు
- ఆధునికీకరణకు రూ.151.81 కోట్లు
- మారనున్న చేపల రేవు రూపురేఖలు



ఫిషింగ్ హార్బర్‌లో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్ఠాత్మక విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత డిసెంబరులో ఈ పనులు మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి ఓడరేవుగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద కేంద్ర ప్రభుత్వం రూ.151.81 కోట్లు మంజూరు చేసింది. మొత్తం ఏడు దశల్లో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. తొలిదశలో ప్యాకేజింగ్ యూనిట్, కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లు వగైరాలకు రూ.40.60 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 21 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. రెండో దశలో ఎలక్ట్రికల్ పనులు పురోగతిలో ఉన్నాయి. మూడో దశలో రెండు వేలం హాళ్లు, రిటైనింగ్ వాల్‌ల నిర్మాణం తదితర పనులకు రూ.30.88 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో ఒక్కో బ్లాక్‌కు రూ.2.5 నుంచి 3 కోట్ల వరకు వెచ్చిస్తారు. నాలుగో దశలో రోజుకు 800 కిలోలీటర్ల సామర్థ్యంతో బుక్కా కాలువ వద్ద ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.4.81 కోట్లు వ్యయం చేయనున్నారు. దీనికి గత నెల 21న టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. ఐదో దశలో ఫ్లోటింగ్/ఫిక్స్‌డ్ జెట్టీల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. ఆరో దశలో డ్రెడ్జింగ్ నిర్వహణ పనులు పురోగతిలో ఉన్నాయి. ఏడో దశలో టైర్ ఫెండర్ల ఏర్పాటు చేయనున్నారు. దీనికి బిడ్ దాఖలైంది. ఇది పరిశీలనలో ఉంది. మరోవైపు మత్స్యకారులు వలలు కుట్టుకునేందుకు నెట్ మెండింగ్ హాలు, వాటర్ ట్యాంకు పనులు, పరిపాలనా బ్లాకు, అసోసియేషన్ల ఆఫీసు బేరర్ల భవనాల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని, సత్వరమే తొలిదశల పనులు పూర్తవుతాయని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

మారనున్న రూపురేఖలు..

ఆధునికీకరణతో విశాఖ ఫిషింగ్ హార్బర్ రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి. రూ.151.81 కోట్లతో హార్బర్‌లోని ప్లాట్‌ఫాంలకు మరమ్మతులు చేపడతారు. రెండు పెద్ద ఎయిర్ కండిషన్డ్ ఆక్షన్ హాలు, మత్స్యకారులకు విశ్రాంతి గదులు, క్యాంటీన్, చేపల రిటైల్ అమ్మకం షాపులు, కోల్డ్ స్టోరేజీలు, అత్యవసర ఫైర్ సబ్‌స్టేషన్ వంటివి ఏర్పాటవుతాయి. విడిగా ప్యాకింగ్ షెడ్, ఆటోమేషన్, లోడింగ్, అన్‌లోడింగ్ బే, డార్మిటరీలు, ఫుడ్‌కోర్టు, ఆర్వో ప్లాంట్, పెద్ద చేపల ఎగుమతికి వీలుగా కన్వేయర్ బెల్టు వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. చేపలను ఎండబెట్టడానికి 20 మెకానికల్, 10 సోలార్ డ్రయ్యర్లతో పాటు కీలకమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తారు. ఇంకా అత్యవసరంగా బోట్ల మరమ్మతుల కోసం డాక్ ఫెసిలిటీని కూడా సమకూరుస్తారు.

యూసీసీపై ప్రజాభిప్రాయం అవసరం



మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాది శ్రీకాంత్

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) డ్రాఫ్ట్ బిల్లును ప్రజల ముందు పెట్టి వివిధ కులాలు, మతాలు, ప్రాంతాల మనోభావాలు తెలుసుకోవాలని తెలంగాణా హైకోర్టు న్యాయవాది చింతల శ్రీకాంత్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో యూసీసీపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. యూసీసీ అనేది వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించి దేశంలోని పౌరులందరికీ వర్తించే సాధారణ చట్టాల రీతిని సూచిస్తుందన్నారు. 1947లోనే రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయం గురించి చర్చించి ప్రజలను చైతన్యపరిచి యూసీసీ వైపు అడుగు ముందుకు వేయాలని యోచించారు తప్ప, రాజ్యాంగం ద్వారా బలవంతంగా రుద్దాలని అనుకోలేదన్నారు. ప్రజల ఆమోదంతో ముందుకెళ్తేనే యూసీసీ ఆశయం నెరవేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేజీహెచ్ వైద్యుడు ఆరోఖ్యనాథ్, అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, బి.తౌడన్న, ఎస్.సత్యనారాయణ, ఎల్.వి.రమణ, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- చర్చకు రానున్న 44 అంశాలు
- 41 సప్లిమెంటరీ అంశాలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. కౌన్సిల్ సమావేశంలో 44 అంశాలు పొందుపరిచారు. 41 సప్లిమెంటరీ అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు సభ్యుల చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా..మెరుగైన శుభ్రత, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నివారణ ద్వారా విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా మార్చేందుకు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా నీటి వనరులు(నీలం), పచ్చదనం (ఆకుపచ్చ), మెరుగు పరచడం వంటిపై చర్చించనున్నారు. పర్యావరణ సమతుల్యం చేయడం, ఎకో-వైజాగ్ అభివృద్ధి కార్యకలాపాలతో పౌరులందర్నీ భాగస్వామ్యం చేసేందుకు ఎకో-వైజాగ్, ఎకో-ఫండ్, సొసైటీలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు అమలు చేసేందుకు మేయర్ ముందస్తు ఆమోదం ధ్రువీకరణకు కౌన్సిల్ అనుమతికి చర్చకు రానుంది. అలాగే జీవీఎంసీ 8 జోన్లలో గల పలు వార్డుల్లో అభివృద్ధి పనుల ఆమోదానికి కౌన్సిల్ ముందుకు రానుంది. మరికొన్ని పరిపాలన అంశాలు చర్చకు రానున్నాయి. దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణి విక్టోరియా విగ్రహం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించి చర్చకు రానుంది. అలాగే అనకాపల్లి జోన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయనున్న పలు అంశాలు, జోన్-1, జోన్-2 పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. పలు ముఖ్య కూడళ్లల్లో పబ్లిక్ వర్క్స్, బీఆర్‌టీఎస్ రోడ్లు, సెంట్రల్ మీడియన్ పనులు, వరద నీటి కాలువ నిర్మాణ పనులు కౌన్సిల్లో చర్చకు రానున్నాయి. ఇటీవల ఎన్నికైన స్థాయి సంఘ సభ్యులను కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేయనున్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 'జ్ఞాన' అవార్డుల ప్రదానం



సీఆర్‌జీ విభాగానికి అవార్డు అందజేస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రతిభ చూపిన పలు విభాగాలకు జ్ఞాన గుర్తింపు అవార్డులను స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎ.కె. బాగ్చీ ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో నాలెడ్జ్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ చూపే విభాగాలకు ఏటా జ్ఞాన అవార్డులను అందజేస్తుంటారు. కోక్‌ఓవెన్స్, సీఆర్‌జీ, ఆర్‌ఎంహెచ్‌పీ ఆర్ అండ్‌డీ, సింటర్ ప్లాంట్ విభాగాల బృందాలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ బి.కె. మహంతి, సీజీఎం ఎస్‌వీ స్వామితో పాటు ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి పరిశోధనలు

- 'సాక్షి'తో యూఎస్‌కు చెందిన హైడ్రో కార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ సూర్యప్రకాశ్



ప్రొఫెసర్ సూర్యప్రకాశ్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి సంబంధించిన ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు జరుగుతున్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు చెందిన హైడ్రోకార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ జీకే సూర్యప్రకాష్ తెలిపారు. ఇప్పటికే ఈ తరహా ప్రయోగాలు అమెరికాలో కొనసాగుతున్నాయని చెప్పారు. మన దేశంలో తమిళనాడులోని కారైకుడిలో పరిశోధనలు సాగుతున్నాయని తెలిపారు. విశాఖలో నిర్వహిస్తున్న ఎనర్జీ ఎఫిషియెంట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. సముద్రపు నీటిలో ఉన్న లవణ శాతాన్ని, క్లోరిన్‌ను వేరు చేసి, ఆ నీటితో హైడ్రో పవర్ ఉత్పత్తికి మార్గాన్ని సుగమం చేయడమే ఎలక్ట్రాలసిస్ లక్ష్యమని వివరించారు. సముద్రపు నీటిని విద్యుత్ ఉత్పత్తికి ఏ రకంగా వినియోగించుకోవాలనే దానిపై పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. ప్రపంచంలో 73 శాతం సముద్ర జలాలే ఉన్నాయని, ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు ఫలిస్తే భవిష్యత్తులో హైడ్రో పవర్ అత్యంత చౌకగా ఉత్పత్తికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 2029 నాటికి 71 మిలియన్ టన్నుల హైడ్రోజన్ అందుబాటులో ఉంటుందని, దీనిని మరింత పెంచడానికి ఎలక్ట్రాలసిస్ దోహదపడుతుందని ప్రొఫెసర్ సూర్యప్రకాష్ తెలిపారు.

అనితా..నోరు అదుపులో పెట్టుకో..!

- స్థాయి మరిచి మాట్లాడడం సరికాదు
- సీఎం జగనన్నను విమర్శించే స్థాయి మీకు లేదు
- టీడీపీ నేతలు అనిత, అనంతలక్ష్మిలకు వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి వార్నింగ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి, చిత్రంలో పీలా వెంకలక్ష్మి, శ్రీదేవివర్మ

సాక్షి, విశాఖపట్నం: 'టీడీపీ వీర వనితలూ..మీ పదవులను కాపాడుకోవడానికి, చంద్రబాబు దగ్గర మార్కులు కొట్టేయడం కోసం మీడియా ముందుకు వచ్చి నీతివాక్యాలు మాట్లాడితే ప్రజలు తరిమికొడతారు. స్థాయి మరిచి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్న టీడీపీ మహిళా నేతలు అనిత, అనంతలక్ష్మిలు నోరు అదుపులో పెట్టుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి హెచ్చరించారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జోనల్ మహిళా ఇన్‌చార్జి పీలా వెంకట లక్ష్మితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.

ముందు మీ పార్టీలో మహిళలకు జరిగిన అన్యాయం..దాడులను గుర్తు చేసుకోండి, మా ప్రభుత్వ హయాంలో మహిళాభ్యుదయానికి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను బేరీజు వేసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు భద్రత పెరిగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెందుర్తిలో దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేసింది ఎవరు? ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేసిందెవరు? అమ్మాయిని చూస్తే ముద్దు అయినా పెట్టుకోవాలి అన్నదెవరు? కాల్‌మనీ కేసుల్లో మహిళలను లైంగికంగా వేధించింది మీ పార్టీ నాయకులు కాదా..? వీటికి సమాధానం చెప్పాలని ధ్వజమెత్తారు.

జోనల్ మహిళా అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకోవడమే కాకుండా సీఎం సతీమణి భారతి, తల్లి విజయమ్మపై టీడీపీ నేత అనిత సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబుకూ కుటుంబం ఉంది, తామూ విమర్శించగలం...కానీ సంస్కారం అడ్డొస్తుందని, మరోసారి రిపీట్ అయితే అందరినీ బయటకు లాగుతామని హెచ్చరించారు. టీడీపీ హయాంలో నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వర్గీయులు ఇద్దరి యువతులను లైంగికంగా వేధించి చంపేసి కేసు లేకుండా పోలీసులను భయపెట్టిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఆ ఆడబిడ్డల తల్లిదండ్రులు మతిస్థిమితం కోల్పోయిన విషయం అందరికీ తెలుసునన్నారు. ఈ సమావేశంలో సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబర్ శ్రీదేవివర్మ, పార్టీ మహిళా నేతలు కారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైట్ టైగర్.. కీ రోల్

- ఇందిరాగాంధీ జూలో ఐదు తెల్లపులుల సందడి
- జంతుమార్పిడిలో ప్రధాన పాత్ర
- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన రెండు పులుల ద్వారా సంతానోత్పత్తి
- ఇతర దేశాలు, రాష్ట్రాల్లోని జూలకు ఆరు పులుల తరలింపు



తెల్ల పులి కుమారితో పిల్లలు వాణి, వీణ, గిరి (ఫైల్)

ఆరిలోవ: మీరు ఎప్పుడైనా.. ఎక్కడైనా తెల్ల పులులను చూశారా? మామూలు పులిని చూడడమే గగనమనుకుంటే.. మళ్లీ తెల్ల పులి అంటారా? అవును చూడటానికి ప్రత్యేకంగా ఉండే తెల్ల పులులు మన ఇందిరాగాంధీ జూ పార్కులో సందడి చేస్తున్నాయి. వీటి గాండ్రింపులతో సందర్శకులను అలరించడంతోపాటు జంతుమార్పిడిలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దేశంలో వివిధ జూ పార్కులు, విదేశాల్లోని జూ పార్కుల నుంచి కొత్త జంతువులు ఇక్కడకు తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఇందిరాగాంధీ జూ పార్కు 1971లో నిర్మించారు. అప్పటి నుంచి సుమారు మూడు దశాబ్దాల వరకు ఇక్కడ తెల్ల పులుల జాడేలేదు. 2000లో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కు నుంచి కుమారి, శిరీష్ అనే జత తెల్ల పులులను జూ అధికారులు ఇక్కడకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి సందర్శకులను అలరిస్తూనే.. వాటి సంతతిని పెంచుకున్నాయి. కుమారి ఐదుమార్లు గర్భం దాల్చి 11 పిల్లలకు జన్మనిచ్చింది. రెండు వారాల కిందట కుమారి మృతి చెందగా, శిరీష్ గతేడాది మరణించింది. ప్రస్తుతం వాటి పిల్లలు జూలో ఉన్నాయి.

నాలుగు తెల్ల పులులు మృతి

జూ పార్కులో కుమారి, శిరీష్‌తో పాటు మూడో విడతలో పుట్టిన రెండు పిల్లలు మృతి చెందాయి. గతేడాది శిరీష్, రెండు వారాల కిందట కుమారి వృద్ధాప్యంతో మరణించాయి. కుమారికి పుట్టిన నాలుగు తెల్లపులులను ఇతర జూ పార్కులకు పంపించగా.. ప్రస్తుతం ఐదు తెల్ల పులులు సందర్శకులను అలరిస్తున్నాయి.

ఐదు విడతల్లో 11 పిల్లలు..

- 2010లో జూ పార్కులో తెల్లపులుల సంతానోత్పత్తి ప్రారంభమైంది. మొదటిసారి కుమారి మూడు కూనలకు జన్మనిచ్చింది. వాటిలో రెండు



వాణి, వీణ ఆడవి, మగ తెల్ల పులి గిరిని జంతుమార్పిడి పద్ధతిలో భాగంగా 2013లో మలేషియా దేశంలోని జూ పార్కుకు తరలించారు. అక్కడ నుంచి మూడు జిరాఫీలను విశాఖ తీసుకొచ్చారు. వాటిలో సముద్రం మార్గంలో ఓడలో ఓ జిరాఫీ మృతి చెందింది. విశాఖ జూ పార్కుకు జిరాఫీలను తీసుకురావడంతో తెల్లపులులు ఉపయోగపడ్డాయి.

- రెండో విడతలో కుమారి నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. విజయ్(మగ), సోనీ, బేతనీ, సావిత్రి (ఆడ) ఉన్నాయి. సావిత్రిని కాన్పూర్ జూకి తరలించి అక్కడ నుంచి మగ ఖడ్గమృగాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు.
- మూడో విడతలో కుమారి రెండు పిల్లలకు జన్మనిచ్చినా.. ఆ రెండూ కొద్ది రోజుల వ్యవధిలోనే మృతి చెందాయి.
- నాలుగో విడతలో బాలు అనే మగ తెల్లపులి పుట్టింది.
- ఐదో విడతలో టీసెస్ అనే ఆడ కూన(కబ్)కు కుమారి జన్మనిచ్చింది.

పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ నాగన్న

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ(క్రైం) జి.నాగన్న పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 50 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కాలపరిమితిలోగా అర్జీల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వినతులు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ద్వారా అందే అర్జీలను నాణ్యతతో పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతు బజార్ కార్డులు, జీవీఎంసీలో ప్రణాళిక అనుమతులు, టీడీఆర్, డ్రైనేజీ సమస్యలపై అధిక ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రైవేట్ సమస్యలు కూడా వచ్చాయని.. జిల్లా లీగల్ సర్వీసెస్ ద్వారా ఫిర్యాదుదారులకు గైడెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్ విశాఖలో ఉందని వెల్లడించారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ఆడిట్ టీం పని చేస్తోందన్నారు. అర్జీల పరిష్కారం పట్ల సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ చేస్తామన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో 52 శాతంతో జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 335 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 95, జీవీఎంసీకి 57, పోలీసు శాఖకు 20, ఇతర విభాగాలకు చెందిన 163 వినతులు ఉన్నాయి. డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 108 వినతులు



ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 108, డయల్ యువర్ మేయర్‌కు 14 అర్జీలు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలసి ఆమె పాల్గొన్నారు. డయల్ యువర్ మేయర్‌లో వచ్చిన 14 ఫిర్యాదుల్లో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 6, టౌన్ ప్లానింగ్‌కు 3, పబ్లిక్ హెల్త్‌కు 2, యూసీడీకి సంబంధించి 3 ఉన్నాయి. జగనన్నకు చెబుదాంలో మొత్తం 108 ఫిర్యాదులు రాగా.. ఒకటో జోన్‌కు సంబంధించి 1, 2వ జోన్‌కు 14, 3వ జోన్‌కు 18, 4వ జోన్‌కు 14, 5వ జోన్‌కు 15, 6వ జోన్‌కు17, 8వ జోన్‌కు 12, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 17 అందాయన్నారు. వీటిలో పరిపాలన, అకౌంట్స్‌కు 7, రెవెన్యూకు 15, పబ్లిక్ హెల్త్‌కు 8, టౌన్ ప్లానింగ్‌కు 36, ఇంజినీరింగ్‌కు 30, హార్టికల్చర్‌కు 2, యూసీడీకి 10 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. వీటిని పరిశీలించి మూడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఓవరాల్ చాంపియన్ కర్నూలు



విజేతలకు ట్రోఫీలు బహూకరిస్తున్న నిర్వాహకులు

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కర్నూల్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని ఆర్గనైజర్ వాసుపల్లి శ్రీహరి తెలిపారు. ద్వితీయ స్థానాన్ని కాకినాడ జిల్లా, తృతీయ స్థానాన్ని చిత్తూరు జిల్లా కైవసం చేసుకున్నాయి. ఈ మేరకు ఆదివారం రాత్రి విజేతలకు బీజేపీ భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కంటుభుక్త రామునాయుడు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్‌కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి తమ్మిన నరసింగరావు, నాయకులు ఉప్పాడ అప్పారావు, మీసాల రామునాయుడు, ప్రసాదరావు పట్నాయక్, ప్రతినిధులు జి.ఆనంద్‌బాబు, రామ్మూర్తిరాజు, చింతలపూడి వెంకట్, గోవింద్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లతో పర్యావరణానికి మేలు



31వ వార్డులో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



72వ వార్డు చినగంట్యాడ ఆర్.కె.ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలు ఉపయుక్తంగా నిలుస్తాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ జోన్–4 పరిధి 31వ వార్డు ఎస్‌బీఐ కాలనీ, జోన్–6 పరిధి 72వ వార్డు చినగంట్యాడ ఆర్.కె.ఆస్పత్రికి వద్ద చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను కమిషనర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కేంద్రాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యర్థాల నిర్వహణ, స్థిరమైన అభివృద్ధికి ఈ కేంద్రాలతో బాటలు వేస్తున్నట్లు చెప్పారు. పాత వస్తువులు, టైర్లను ఉపయోగించి మహిళల కోసం రెస్ట్ రూమ్, కాఫీ సెంటర్‌గా 31వ వార్డులోని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. రకరకాల గాజు, కాగితం, మెటల్ ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ కేంద్రాల ద్వారా సేకరించి.. వాటితో తిరిగి ఉపయోగించుకునే వస్తువులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, సింహాచలం, ఏఎంవోహెచ్‌లు చుక్కా సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం: సౌత్ ఈస్ట్రన్ రైల్వే, అద్రా డివిజన్ తల్‌గోరియా–బొకారో నార్త్ కేబిన్ పరిధిలో డబ్లింగ్ పనుల కారణంగా బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ధన్‌బాద్–అలెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ వయా చంద్రపూర, బర్కాకానా, మురి స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

పలు రైళ్లకు మారిన వేళలు : టాటానగర్–ఎర్నాకుళం(18189) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 10.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 10.40 గంటలకు బయలుదేరుతుంది. ● షాలిమార్–తిరువనంతపురం (22642) సూపర్ ఫాస్ట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 11.40 గంటలకు బయలుదేరుతుంది. ● సిల్చార్–తిరువనంతపురం సెంట్రల్(12508) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 11.40 గంటలకు బయలుదేరుతుంది.

హక్కుల ప్రదాత డాక్టర్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. దళిత కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దువ్వాడ బ్రిడ్జి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ అనేక పోరాటాలు చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు, మామిడి సుదర్శన్, మాటూరి శ్రీనివాసరావు, బలిరెడ్డి పెంటారావు పాల్గొన్నారు.

తండ్రి మందులకొచ్చి.. ప్రాణాలు విడిచి..

- బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదం
- మృతి చెందిన శ్రీకాకుళం జిల్లా మహిళ



ప్రమాద స్థలంలో గాయాలతో రమణమ్మ.. ఆమె ఒడిలో పెంపుడు కుక్క

ఆరిలోవ: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి మందుల కోసం నగరానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సంచం గ్రామానికి చెందిన గొర్లె రమణమ్మ(44) తల్లిదండ్రుల వద్ద నివాసం ఉంటోంది. ఆమె భర్త కొన్నాళ్ల కిందట మరణించాడు. ఆమెకు పిల్లలు లేరు. తండ్రి అనారోగ్యానికి గురవడంతో అతనికి అవసరమైన మందుల కోసం ప్రతి నెలా కేజీహెచ్‌కు వస్తోంది. ఎప్పటిలాగే ఆమె స్కూటీపై తన పెంపుడు కుక్కతో సోమవారం ఉదయం రణస్థలం నుంచి విశాఖ బయలుదేరింది. హైవేపై వస్తుండగా జూపార్కు దాటిన తర్వాత కంబాలకొండ ఎకో టూరిజం పార్కు గేటు ఎదురుగా ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఆమె కిందపడి తీవ్రగాయాలపాలైంది. వెంటనే వాహనచోదకులు 108 అంబులెన్స్‌లో ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఆమె మృతి చెందారు. తన తండ్రికి మందులు తీసుకెళ్లకుండానే ఆమె ప్రాణాలు విడిచారు. ఆమె వెంట తీసుకొచ్చిన పెంపుడు కుక్క దిక్కుతోచని స్థితిలో.. సంఘటన స్థలంలో ఆమె ఒడిలోకి చేరి బిక్కుబిక్కుమంటూ కూర్చొంది. కుక్కకు ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న ఆమె బంధువులు కేజీహెచ్‌కు చేరుకున్నారు. రమణమ్మ తమ్ముడు మీసాల అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

సబ్బవరం: ప్రేమపేరుతో బాలికను మోసగించిన గుల్లేపల్లి చెందిన అమరశెట్టి సత్యదేవపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ రంగనాథం తెలిపిన వివరాలివీ.. సత్యదేవ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వంచించి.. ఈ నెల 12న ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. పెందుర్తి మండలంలోని పురుషోత్తపురంలో ఓ షెడ్డు అద్దెకు తీసుకున్నాడు. ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ నెల 19న బాలికను తిరిగి ఆమె ఇంటి వద్ద వదిలేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలిక అదృశ్యమైనట్లు సబ్బవరం పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. బాలిక తిరిగి వచ్చిన తర్వాత పరవాడ డీఎస్పీ కె.వి సత్యనారాయణ వివరాలు సేకరించి యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు చేశారు. ఈ నెల 23న యువకుడిని అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరు పరచగా.. కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

కటక్–హైదరాబాద్ స్పెషల్ సెప్టెంబర్ 27 వరకు పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్– కటక్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ప్రతీ మంగళవారం రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుండి 9.07 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబర్ 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో కటక్–హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ప్రతీ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయలుదేరి ఆదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 27వ తేదీ వరకు పొడిగించారు.

'గురువులు'కు అభినందనల వెల్లువ



కోలా గురువులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులకు సోమవారం పలువురు పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, నడింపల్లి కృష్ణంరాజు, జోనల్ ఇన్‌చార్జిలు బర్కత్ ఆలీ, అల్లంపల్లి రాజబాబు, పీలా వెంకటలక్ష్మి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి, బోని శివరామకృష్ణ, బొండా ఉమామహేశ్వరరావు, కె.వి.బాబా, పెంద్రు అప్పన్న, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, జైన్, నాయకులు పేర్ల విజయచందర్, శ్రీదేవివర్మ, దామా సుబ్బారావు, కాశీ విశ్వనాథ్, రోజారాణి గురువులను అభినందించారు.

ట్రాలర్ ఢీకొని మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని మహిళను ట్రాలర్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో మృతి చెందింది. పాత గాజువాక పంతులు గారి మేడ వద్ద సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పంతులుగారి మేడ వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న మహిళ రోడ్డు దాటుతోంది. పాతగాజువాక నుంచి షీలానగర్ వైపు వస్తున్న ట్రాలర్ ఆమెను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని.. ట్రాలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఆకుపచ్చ చీర, నీలం రంగు జాకెట్ ధరించి ఉందని, గుర్తించిన వారు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.